క్లుప్తంగా

వైభవంగా నగరోత్సవం



శిలా విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న మారం వెంకారెడ్డి

చీమకుర్తి: మారం వంశీకుల ఆధ్వర్యంలో బుధవారం చీమకుర్తిలో సాక్షిరామలింగేశ్వరస్వామి, శ్రీవేణుగోపాలస్వామి విగ్రహాల నగరోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉగాది పర్వదినం సందర్భంగా ప్రతి ఏటా ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇసుకవాగులోని సాక్షి రామలింగేశ్వరస్వామి, శ్రీవేణుగోపాల స్వామిని ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మారం వెంకటేశ్వరరెడ్డి, సుధాకర్‌రెడ్డి, అంజిరెడ్డి, పురుషోత్తంరెడ్డి, కోటా రాములు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

2న భార్యాభర్తలు, అత్తాకోడళ్లకు అవగాహన సదస్సు

ఒంగోలు రూరల్: మండలంలోని కరవది గ్రామంలో బైబిల్‌మిషన్ ఆధ్వర్యంలో మే 2వ తేదీ భార్యాభర్తలు, అత్తాకోడళ్లకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు గుంటూరు బైబిల్ మిషన్ గవర్నింగ్ బాడీ మెంబర్, ప్రకాశం జిల్లా ఇన్‌చార్జ్ రెవ. ఆర్.ఎం.పి.ప్రభాకర్‌కుమార్ తెలిపారు. నేటి సమాజంలో చిన్న చిన్న సమస్యలకే కుటుంబ కలహాలు, ఎదుటివారి కంటే తాము అధికులమనే భావన, ఒకరినొకరు అర్థం చేసుకోకపోవడం, అత్త పెత్తనం చెలాయించడం, కోడలు అత్తలో తన తల్లిని చూసుకోలేకపోవడం వంటి వాటి వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించేందుకే ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వివరించారు. కరవది అంబేడ్కర్‌నగర్‌లోని బైబిల్‌మిషన్ దేవాలయం ఫస్ట్‌ఫ్లోర్‌లో ఈ సదస్సు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల వారు ఈ నెల 27వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. నిర్ణీత ప్రొఫార్మాలో కొన్ని సంఘటనలు ఉదహరిస్తూ పేజీకి మించకుండా పంపాలని తెలిపారు. బెస్ట్ కపుల్స్ అవార్డు, బెస్ట్ అత్తాకోడళ్ల అవార్డు అందజేస్తామని, కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి వారికి బహుమతి అందజేస్తామని తెలిపారు. క్రైస్తవ సంఘ సభ్యులు, దంపతులు, ఎంట్రీ పాస్‌తో ఉదయం 8 నుంచి 9.30 గంటల్లోపు సదస్సుకు హాజరుకావాలన్నారు. ఇతర వివరాలకు 97050 97771 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

శింగరకొండలో నూతన భవనాలు ప్రారంభం

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ క్షేత్రంలో నూతనంగా నిర్మాణాలు చేపట్టిన వాణిజ్య సముదాయాలను, పరిపాలన కార్యాలయాన్ని దాతలు బుధవారం ప్రారంభించారు. పరిపాలన కార్యాలయాన్ని దాతలు శిద్యాద వెంకటేశ్వరరావు, సూర్యకుమారి కుటుంబ సభ్యులు, వాణిజ్య సముదాయాన్ని దాతలు ఒంటిపులి ఆంజనేయులు, దేరంగుల వెంకటేశ్వర్లు, బండారు వెంకటేశ్వర్లు, కంచపు శ్రీనివాసరావు ప్రాంభించారు. ఈవో సుభద్ర, ధర్మకర్తల మండలి చైర్మన్ కోట శ్రీనివాసకుమార్, పాలకమండలి సభ్యులు జమ్మలమడక రమాదేవి, హనుమంతరావు కుందుర్తి రజనిరాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





ఒంగోలు లాయర్‌పేట సాయిబాబా ఆలయంలో భక్తులు

ఘనంగా ఉగాది వేడుకలు

● శోభకృత్ నామ తెలుగు నూతన సంవత్సరానికి స్వాగతం పలికిన ప్రజలు



నాగులుప్పలపాడు : అమ్మవారికి ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ



ఒంగోలు : వేడుకలు నిర్వహిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘ నాయకుల



చీమకుర్తి : హరిహరక్షేత్రంలో పూజలు చేస్తున్న శిద్దా రాఘవరావు, సుధీర్

ఒంగోలు టౌన్: శ్రీ శోభకృత్ నామ తెలుగు నూతన సంవత్సరానికి ప్రజలంతా ఘనంగా స్వాగతం పలికారు. ఉగాది పండుగ పర్వదినాన్ని బుధవారం ఆనందంగా జరుపుకున్నారు. ఒంగోలు నగరంలోని అన్ని దేవాలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. స్థానిక కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరీ పీఠపాలిత శ్రీగిరి శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో ఉగాది వేడుకలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. సర్వాభరణ సుశోభితుడైన శ్రీవారిని వేల సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. శ్రీవారికి సుప్రభాత సేవ, సహస్ర నామార్చన, సువర్ణ అష్టదళ పద్మ పాదార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ఉగాది పచ్చడితో పాటు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ప్రముఖ వేదపురోహితులు మతంపల్లి దక్షిణామూర్తిశాస్త్రి పంచాంగ శ్రవణం చేశారు. టీటీడీ ధార్మిక సలహా మండలి జిల్లా పూర్వ అధ్యక్షుడు ఆలూరు వేంకట రమణారావు, కార్యనిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, అర్జిత సేవల ధర్మకర్త అలూరు జ్వాలా రామారావులు మతంపల్లిని ఘనంగా సత్కరించారు.

గీతా మందిరంలో పంచాంగ శ్రవణం...

నగరంలోని గాంధీరోడ్డులో గల గీతామందిరంలో ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరు శ్రీనివాసులు పంచాంగ శ్రవణం చేశారు. ఉగాది రోజు తీసుకునే మంచి నిర్ణయాలు భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తాయని చెప్పారు. ఉగాది రోజున సృష్టి ప్రారంభమైన రోజుగా, దశావతారాల్లో విష్ణుమూర్తి మత్స్య అవతారం ధరించిన రోజుగా పేర్కొన్నారు. షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడి ఆయుర్వేదంలో వ్యాక్సిన్‌లా పనిచేస్తోందని, కులమతాలకతీతంగా ప్రసాదంలా కాకుండా దివ్య ఔషధంగా తీసుకోవడం వలన ఆయురారోగ్యాలు సంప్రాప్తిస్తాయని అన్నారు. పంచాంగ శ్రవణం వలన పాప విమోచనం కలుగుతుందని, గంగాస్నాన ఫలితం సిద్ధిస్తుందని చెప్పారు. రాశి ఫలితాలను వివరించారు.

హ్యూమన్ రైట్స్ ఆధ్వర్యంలో...

కులమతాలకతీతంగా ఉగాది పండుగను అన్నివర్గాల ప్రజలు ఆనందంగా జరుపుకుంటారని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు షేక్ ఖలీఫతుల్లా అన్నారు. స్థానిక మౌర్య ఇన్ కాన్ఫరెన్స్ హాలులో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉగాది పండుగ సర్వ మానవ



అష్టావధానం నిర్వహిస్తున్న కవులు

సౌభ్రాతృత్వాన్ని ఆకాంక్షిస్తుందని ముస్లిం సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు షేక్ రఫి అన్నారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరు శ్రీనివాసులును సత్కరించారు. కార్య క్రమంలో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు మన్నెం ఉష, ఆఫీస్ ఇన్‌చార్జి సాదిక్ ఖాన్, ఎస్‌కే ఆషిద్, చెన్నాప్రగడ హనుమత్‌సాయి, ఎండీ అఫ్సర్, జిలాని తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో...

శ్రీ విరాట్ విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం రంగారాయుని చెరువు కట్టపై వేంచేసి ఉన్న శ్రీగోవిందమాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో పణిదెపు బ్రహ్మయ్యాచారి పంచాంగ శ్రవణం చేశారు. వివిధ రంగాల్లో సేవలందిస్తున్న చోడా సుందరాచారి, కందేపి మల్లికార్జునరావు, నూతలపాటి వీరబ్రహ్మం, డా.తణుకు భీమారావు, నటరాజు, ఆదిమూలం సుబ్బారావు, చెలికిచర్ల వెంకట కోటేశ్వరమ్మలకు ఉగాది పురస్కారాలు అందజేశారు. సంఘం నాయకులు కొండపి శివవరప్రసాదరావు, జి.మాధవాచారి, రావినూతల నాగేశ్వరరావు, మేడపి గురుబ్రహ్మాచారి, పులివర్తి శ్రీనివాసరావు తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు

కొత్తపట్నం మండలంలో...

కొత్తపట్నం: తెలుగువారి నూతన సంవత్సరానికి మండల ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. మండలంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. గృహాలకు, షాపులకు మామిడి తోరణాలు కట్టి షడ్రుచుల ఉగాది పచ్చడి ఆరగించి కొత్త దుస్తులు, పిండివంటలు పూజలతో పండుగను ఆనందంగా జరుపుకున్నారు. పరస్పరం ఉగాది శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మండల వ్యాప్తంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మండలంలో పలు ఆధ్యాత్మిక సాహిత్య సాంస్కృతిక సంస్థలు పంచాంగ శ్రవణాలు ఏర్పాటు చేశాయి. తెలుగు నూతన సంవత్సర పంచాంగ పుస్తకాన్ని ఆవిష్కరించారు. జీవితంతో శుభాలు కలగాలని కోరుతూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆలయాల్లో పురోహితులు ఉగాది పండుగ ప్రాముఖ్యతను వివరించారు.

నాగులుప్పలపాడు మండలంలో...

నాగులుప్పలపాడు: తెలుగు వారి నూతన ఏడాది పండుగ ఉగాది పర్వదినాన్ని మండల వ్యాప్తంగా ప్రజలు ఆనందంగా జరుపుకున్నారు. శ్రీ శోభకృత్ నామ సంవత్సరం ప్రారంభం సందర్భంగా ఉదయం నుంచే ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. చదలవాడ రఘునాయకస్వామి ఆలయం, కనపర్తి లింగోద్భవ స్వామి ఆలయం, ఉప్పుగుండూరు వేణుగోపాల స్వామి ఆలయాల్లో పూజారులు ప్రత్యేక పూజలతో పాటు భక్తులకు దైవదర్శనం కల్పించారు. సాయంత్ర సమయంలో ఆళ్వారాజుల వేణుగోపాలస్వామి ఆలయంలో నిర్వహించిన పంచాంగ శ్రవణంలో ఆలయ పూజారి దివి శ్రీధర్‌బాబు పంచాగం చదివి వినిపించారు. ఉగాది సందర్భంగా ఆలయాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. పంచాంగ శ్రవణంలో ఉప్పుగుండూరు ఈవో మీనిశెట్టి శ్రీ. నివాసరావు, చదలవాడ ఈవో డి.అనీల్‌కుమార్, మాదాసు రాంబాబు, కొంజేటి సురేష్, మున్నంగి వెంకట్రావు, పెంట్యాల జ్యోతి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చీమకుర్తి హరిహరక్షేత్రంలో శిద్దా పూజలు...

చీమకుర్తి: వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, ఆయన కుమారుడు సుధీర్, సోదరుడు పాండురంగారావులు బుధవారం చీమకుర్తిలోని హరిహరక్షేత్రంలో పూజలు చేశారు. ఉగాది పర్వదినం సందర్భంగా ఆలయంలోని సర్వదేవతలకు పూజలు చేసి స్వామివారి ఆశీర్వాదాలు స్వీకరించారు. అనంతరం వేదపండితుల ఆధ్వర్యంలో శిద్దా రాఘవరావు, వారి కుటుంబ సభ్యులు పంచాంగ శ్రవణం ఆలకించారు.



ఒంగోలు : పంచాంగం వినిపిస్తున్న పొన్నూరు



ఒంగోలు : హ్యూమన్ రైట్స్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు



నాగులుప్పలపాడు : విద్యుత్ దీపాలంకరణలో దేవాలయాలు







జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ అభిషిక్త్ కిషోర్, జూపూడి ప్రభాకరరావు చేతుల మీదుగా సన్మానాలు అందుకుంటున్న వేదపండితులు

లైటింగ్ పోల్‌ను ప్రారంభించిన మేయర్



లైటింగ్ పోల్‌ను ప్రారంభిస్తున్న మేయర్ గంగాడ సుజాత



కార్యక్రమానికి హాజరైన స్థానికులు

ఒంగోలు: స్థానిక భాగ్యనగర్ రెండోలైనులోని పార్కులో రూ.2 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన 12 మీటర్ల పొడవైన హైమాక్స్ సెంట్రల్ లైటింగ్ పోల్‌ను నగర మేయర్ గంగాడ సుజాత బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సహకారంతో నగరంలోని 20వ డివిజన్‌లో రూ.1.50 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. త్వరలోనే వాటిని బాలినేని చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. అంతేగాకుండా మోడల్ పార్కు కింద రూ.40 లక్షలతో పార్కు పనులను కూడా త్వరలోనే ప్రారంభించుకోవడం జరుగుతుందన్నారు. నగర ప్రజల దాహార్తి తీర్చే రూ.350 కోట్ల మంచి నీటి సరఫరా ఆధునికీకరణ, ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం తదితరాలకు సంబంధించి టెండర్ ప్రక్రియ జరుగుతోందని, అది కూడా ఏడాదిలో పూర్తిచేసి శాశ్వత నీటి సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. అభివృద్ధిని వేగవంతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తాను కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఇప్పటివరకు రూ.50 కోట్ల విలువైన పనులను నగరంలో చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో 20వ డివిజన్ కార్పొరేటర్ పసుపులేటి విజయలక్ష్మి శ్రీనివాసరావు, 15వ డివిజన్ కార్పొరేటర్ గోపి, పీడీసీసీబీ మాజీ చైర్మన్ మేదర మెట్ల శంకరారెడ్డి, ఆళ్ల వెంకటేశ్వరరావు, భాగ్యనగర్ వాసులు పాల్గొన్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని చిన్నారులు ఇదే వేదికపై ప్రదర్శించిన కోలాటం, సాంస్కృతిక నృత్యప్రదర్శన ఆకట్టుకుంది.

సీతారామస్వామి దేవాలయంలో నవరాత్రి ఉత్సవాలు



వసంత నవరాత్రుల్లో భాగంగా సీతారాముల కల్యాణం

ఒంగోలు టౌన్: శోభకృత్ నామ తెలుగు నూతన సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్మలనగర్ పార్కు సమీపంలోని సీతారామస్వామి దేవస్థానంలో 30వ వసంత నవరాత్రుల మహోత్సవాలను బుధవారం ప్రారంభించారు. సాయంత్రం కల్యాణ మండప అలంకరణ, సీతారామలక్ష్మణ దేవతామూర్తులను కల్యాణ వేదిక మీదకు ఆహ్వానించడం, విశ్వక్సేన పూజ, పుణ్యాహావాచనం, నవగ్రహ పూజ, దిక్పాలక పూజలు చేశారు. అనంతరం వేదపఠనం జరిగింది. పండిట్ పరాంకుశం కేశవాచార్యులు, ములుకుట్ల సుబ్రహ్మణ్యేశ్వరశర్మ ప్రవచనాలు చేశారు. ఈ నెల 31వ తేదీ వరకు మహోత్సవాలు జరగనున్నాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నిర్మల్‌నగర్ అభివృద్ధి కమిటీ గౌరవాధ్యక్షుడు తాటిపర్తి గోపాలరెడ్డి, అధ్యక్షుడు డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, ఉపాధ్యక్షుడు డాక్టర్ కంచర్ల సుబ్బారావు, కోశాధికారి అమరవాది మహదేవప్రసాద్, నలమలపు ప్రభాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియం నిర్మాణానికి కృషి



కబడ్డీ మ్యాచ్‌లో తలపడుతున్న క్రీడాకారులు

చినగంజాం: ఉమ్మడి ప్రకాశం జిల్లా కబడ్డీ క్రీడాకారుల కోసం ఇండోర్ స్టేడియం నిర్మాణం చేసేందుకు కృషి చేస్తానని శ్రీ భ్రమర టౌన్ షిప్ ప్రయివేట్ లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ గల్లా రామచంద్రరావు అన్నారు. మ్యాట్‌పై శిక్షణ పొందేందుకు రూ. 3 లక్షలు విలువైన మ్యాట్‌ను జిల్లా కబడ్డీ అసోసియేషన్‌కు అందజేసే కార్యక్రమాన్ని బుధవారం రాత్రి చినగంజాం ఎంఎస్ఆర్ జూనియర్ కాలేజీ ఆవరణలో నిర్వహించారు. జాతీయ కబడ్డీ క్రీడాకారుడు, డీఎస్పీ అన్ను వేణుగోపాల్ అధ్యక్షత వహించారు. ప్రకాశం జిల్లాలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కబడ్డీలో సత్తా చూపించ గలిగిన క్రీడాకారులున్నారని, ఇటీవల రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో ప్రకాశం జిల్లా కబడ్డీ జట్టు ప్రతిభ కనబరచారన్నారు. జిల్లాలో క్రీడాకారులకు తగినట్లుగానే కబడ్డీని నేర్పగలిగిన కోచ్‌లు కూడా ఉన్నారని, క్రీడాకారులు మరింత మంది జిల్లా నుంచి తయారు కావాలని, జిల్లా పేరును జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టాలన్నారు. ప్రస్తుతం 20 కోట్ల మంది కబడ్డీని ఆసక్తిగా తిలకిస్తున్నారని, వారంతా జిల్లాలో తయారైన క్రీడాకారుల ఆటను కూడా చూడాలనే ఉద్దేశంతో ప్రతిభ కలిగిన క్రీడాకారులుగా శిక్షణ పొందాలన్నారు. రాష్ట్రంలోనే అతి పెద్ద కబడ్డీ మ్యాట్‌ను తొలిసారిగా జిల్లా కబడ్డీ అసోసియేషన్‌కు సమకూర్చిన ఆయనకు అందరూ ధన్యవాదాలు తెలియజేశారు. రామచంద్రరావును కబడ్డీ అసోసియేషన్ వారు కబడ్డీ మ్యాట్‌ను ప్రారంభించగా నిర్వాహకులు క్రీడాకారులచే ప్రదర్శన మ్యాచ్‌ను ఆడించారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు, జిల్లా కబడ్డీ మాజీ కార్యదర్శి శిఖరం రాంబాబు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్ వై. రామచంద్రరావు, వైస్ ప్రెసిడెంట్ శిరిగిరి రంగారావు, కార్పొరేటర్ ఈదర సురేష్ బాబు, చెరుకూరి పుల్లయ్య, నరేష్, దాసరి రమేష్, అంతర్జాతీయ క్రీడాకారుడు మరపాల గిరిబాబు, సీనియర్ కబడ్డీ క్రీడాకారులు నాగాంజనేయులు, శివ, ఉమామహేశ్వరరావు, జాతీయ, అంతర్జాతీయ, సీనియర్ కబడ్డీ క్రీడాకారులు పాల్గొన్నారు.



కబడ్డీ మ్యాట్‌ను ప్రారంభిస్తున్న గల్లా రామచంద్రరావు, అసోసియేషన్ సభ్యులు